క్లుప్తంగా

రక్తదాన శిబిరం

బిట్రగుంట: బిట్రగుంట రైల్వేస్టేషన్ ప్రాంగణంలో రైల్వే గార్డ్స్ ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆల్ ఇండియా రైల్వే గార్డ్స్ కౌన్సిల్ 58వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ మెగా రక్తదాన శిబిరంలో సుమారు 70 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు అండగా నిలిచేందుకు ఈ రక్తదాన శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా రైల్వే గార్డ్స్ ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కూడా పాల్గొని రక్తదానం చేశారు.

వైద్యశిబిరం ఏర్పాటు



ఆత్మకూరు: మహాశివరాత్రి సందర్భంగా శనివారం స్థానిక మున్సిపల్ పరిధిలోని తిరునాళ్ల తిప్పపై కాశీనాయన ఆశ్రమం వద్ద వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్, అభిరామ్ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, మేకపాటి దీప్తి దంపతుల ఆధ్వర్యంలో ఆశ్రమం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. భక్తుల కోసం వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. డీఎస్పీ ఎన్.కోటారెడ్డి, సీఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్సై ఎం.శివశంకర్‌రావు ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

సంగం: మండలంలో శనివారం పలుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. శనివారం తెల్లవారుజామున కొండమలుపు దిగువన నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు గాయపడగా చికిత్సనిమిత్తం 108 వాహనంలో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అలాగే రెండు బైకులు ఎదురుగా ఢీకొని ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. సంగం చెక్‌పోస్టు సెంటర్‌లో బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో సైతం మరో యువకుడు గాయపడ్డారు. ఈ ఘటనలపై సంగం పోలీసులకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. గాయపడిన వారందరూ ప్రథమ చికిత్స అనంతరం తరలివెళ్లారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కావలి రూరల్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కావలి రైల్వేస్టేషన్‌లో శనివారం జరిగింది. రైల్వే ఎస్సై అరుణ కుమారి కథనం మేరకు.. 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి ఉత్తర వైపు చివరన డౌన్‌లైన్‌లో తాంబరం వీక్లీ సూపర్ ఫాస్ట్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని చనిపోయాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా? అని తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం



ఉదయగిరి: మండలంలోని గండిపాళెం పంచాయతీ కార్యదర్శి గాజులపల్లి అమర్‌నాథ్ రెడ్డిని శనివారం గండిపాళెంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ అమర్‌నాథ్‌రెడ్డి ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అధికారుల నుంచి గౌరవం పొందారన్నారు. కార్యక్రమంలో నాయకులు అడుసుమల్లి వెంకటేశ్వర్లు, పాముల రమణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బాలిక ఇంటి నుంచి అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వివరాలు.. బుజబుజనెల్లూరు వల్లూరుమ్మకాలనీలో శశిప్రియ తన ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటోంది. ఆమె క్యాటరింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుమార్తెను ఆరోతరగతి వరకు చదివించారు. ఆర్థిక స్థోమత లేక ఆ తరువాత చదువు మానిపించింది. గతంలో శశిప్రియ రామకోటయ్యనగర్‌లో నివాసం ఉండేసమయంలో అదే ప్రాంతానికి చెందిన బాలుడు ఫోన్‌లో తన కుమార్తెతో మాట్లాడుతుండడాన్ని గమనించి మందలించింది. గతేడాది నవంబరులో బాలిక ఇంట్లో నుంచి వెళ్లిపోగా అప్పట్లో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా గుర్తించి అప్పగించారు. తిరిగి డిసెంబర్‌లో బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో తల్లి వేదాయపాళెం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుం ప్రాణనాథం.. విభుం విశ్వనాథం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం ఉదయగిరి, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాల్లో పరమేశ్వరునికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. హరహర మహాదేవ శంభోశంకర.. ప్రభుం ప్రాణనాథం.. విభుం విశ్వనాథం.. అంటూ భక్తుల శివనామస్మరణతో ఆధ్యాత్మికత సంతరించుకుంది.

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- ఆలయాల్లో శివుడికి అభిషేకాలు, విశేష పూజలు
- కల్యాణోత్సవాలు, లింగోద్భవ కాల పూజలు నిర్వహించిన అర్చకులు
- భక్తులకు భారీ అన్నదానాలు చేసిన నిర్వాహకులు



దుత్తలూరు: విశేష అలంకరణలో రామలింగేశ్వరస్వామి



ఆత్మకూరు: శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని అన్నపూర్ణా సమేత శివాలయంలో, కాశీనాయన ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. శివాలయంలో అర్చకుడు మేళ్లచెరువు శివకుమారశర్మ మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పూజలు, శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భారీస్థాయిలో భక్తులకు అన్నదానం చేశారు. కాశీనాయన ఆశ్రమంలో నిర్వాహకుడు రామచంద్రయ్యస్వామి ఆధ్వర్యంలో విశ్వేశ్వర మహాలింగానికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వేలాది మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ దంపతులు, డీఎస్పీ ఎన్.కోటారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, తారకనాథ్ రెడ్డి, పులిమి శైలజ, పి.రవీంద్రారెడ్డి, కౌన్సిలర్ కె.కౌసల్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరునికి..

సంగం: స్థానిక తిరుమనకొండపై వెలసిన కాశీ విశ్వేశ్వరస్వామికి మహాశివరాత్రి సందర్భంగా పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పెన్నానది ఒడ్డున వెలసిన సంగమేశ్వరస్వామి, వంగల్లు, దువ్వూరు గ్రామాల్లోని భీమేశ్వర, శ్రీకోటేశ్వర ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు. వంగల్లులోని భీమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా కామాక్షిదేవి సమేతుడైన భీమేశ్వరుడు నందివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్త పగడాల రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

శంభోశంకర..

సీతారామపురం: మండలంలోని సిద్దేశ్వరం, రామయ్యస్వామి శివాలయం, నెల్లూరు – ప్రకాశం సరిహద్దులోని భైరవకోన క్షేత్రాల్లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సిద్దేశ్వరంలో శివునికి, ఇష్టకామేశ్వరి అమ్మవారికి పూజలు చేశారు. రామయ్యస్వామి శివాలయం వద్ద హోమాలు నిర్వహించారు. భైరవకోనలో ఒకే రాతిలో మలిచిన అష్ట దేవాలయాలను భక్తులు దర్శించుకున్నారు. శ్రీముఖ దుర్గ బర్గులేశ్వరునికి పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. నెల్లూరు, ప్రకాశం, కర్నూలు, చిత్తూరు, అనంతరం జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఈ క్షేత్రాలకు విచ్చేశారు.

కమనీయం.. కల్యాణం

సోమశిల: సోమశిలలోని పురాతన సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా విశేష పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఉప్పల సోమసుందరమూర్తి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. చిలకలమర్రిలో మల్లెంకొండ శిలల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కామిరెడ్డిపాడులోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా క్షేత్రాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

చిరమన గ్రామంలో..

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమన గ్రామంలో శ్రీకామాక్షి సమేత చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

లక్ష బిల్వార్చన

చేజర్ల: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోటితీర్థం శివాలయంలో కోటేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. డాక్టర్ వెన్నెలకంటి ప్రకాశం ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన పూజలు చేశారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కోటితీర్థంలోని కోటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

సంజీవ శిఖరంపై..

దుత్తలూరు: దుత్తలూరు గ్రామ సమీపంలోని సంజీవ పర్వతంపై వెలసిన రామలింగేశ్వరస్వామికి మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కొండ దిగువ భాగాన శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో..

మర్రిపాడు: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని చుంచులూరు, పడమటినాయుడుపల్లి, చాబోలు, నెర్దనంపాడు, పొంగూరుకండ్రిక గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చాబోలు అటవీ ప్రాంతంలోని సిద్దులకోనలో వెలసిన నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. హిమాలయాల నుంచి వచ్చిన స్వాములు హిందూ మహాసభ ధర్మాచార్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి యోగి అతిథి మహారాజ్, మాతాజీ ప్రవచనాలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు దుగ్గిరెడ్డి కృష్ణాప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పొంగూరుకండ్రికలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

విశేష పూజలు

కావలిరూరల్: కావలిలోని రుద్రపాదక్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా దుర్గాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. తిరువీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి మహాలింగోద్భవం గావించి స్వామివారిని నందివాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సత్యహరిశ్చంద్ర, రామాంజనేయయుద్ధం, గయోపాఖ్యానం, భవాని సీను తదితర పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

నల్లగొండ్లలో..

వింజమూరు: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని నల్లగొండ్లలో గుహమల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నాభిషేకం, శివపార్వతుల కల్యాణం వేడుకగా నిర్వహించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. రాత్రికి కల్యాణోత్సవం నిర్వహించారు. విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. వింధ్యపరమేశ్వరి ఆలయంలో, నడిమూరులోని గురప్పస్వామి ఆలయంలో, చంద్రపడియలోని కాశీనాయన ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా..

బిట్రగుంట: బోగోలు మండలంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పరమశివునికి అభిషేకాలు, బిల్వార్చన చేశారు. విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాళెంలోని రామలింగేశ్వరాలయం, సోమేశ్వరపురంలోని సోమేశ్వరాలయం, జువ్వలదిన్నెలోని ప్రాచీన సాంబ సదా శివాలయంలో శివరాత్రి వేడుకలు నిర్వహించారు శివునికి ప్రీతికరమైన జిల్లేడు, మందారం, జమ్మి, మారేడు, ఉత్తరేణి, సంపంగి, మల్లి, జాజి, తుమ్మ, కలువ పూలు, ఆవుపాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, తేనెలతో అభిషేకాలు నిర్వహించారు. సర్పంచ్ భవానీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

కొండాపురం: స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో వీరబ్రహ్మేంద్రస్వామి – గోవిందమాంబ కల్యాణం కనులపండువగా నిర్వహించారు. జంగాలపల్లి, ఆదిమూర్తిపురం, సాయిపేట గ్రామాల్లోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

శైవక్షేత్రాల్లో..

ఉదయగిరి: మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని పార్వతీ పరమేశ్వర ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణం అత్యంత వేడుకగా నిర్వహించారు. గండిపాళెం సిద్దేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం కనులపండువగా జరిగింది. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. యర్రబల్లిగడ్డ, గుడినరవ, అప్పసముద్రం, లింగాలదొన తదితర శైవక్షేత్రాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

సిద్ధనకొండూరులో..

కలిగిరి: మండలంలోని సిద్ధనకొండూరులోని సిద్ధేశ్వరస్వామి ఆలయం, కలిగిరిలోని పర్వవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయం, ఆగ్రహారంలోని కాలభైరవస్వామి ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. బిగ్‌బాస్ ఫేం ఆదిరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అన్నదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

భక్తుల పూజలు

జలదంకి: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని బ్రాహ్మణక్రాక, జలదంకి, చినక్రాక, చామదల, గట్టుపల్లి తదితర గ్రామాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అంకుర్పారణ, రుద్రాభిషేకం, తెప్పోత్సవం, గ్రామోత్సవాలు నిర్వహించారు. రాత్రి లింగోద్భవ కాలంలో అభిషేకాలు నిర్వహించారు. బ్రాహ్మణక్రాక శివాలయంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గొట్టిగుండాల మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

నార్త్ మోపూర్‌లో..

అల్లూరు: మండలంలోని నార్త్ మోపూర్ గ్రామంలో గల శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిగింది.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

ఆత్మకూరురూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని మురగళ్లలో వెలసిన శ్రీఅన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు భారీ ఎత్తున అన్నదానం చేశారు. రాత్రికి శివపార్వతుల కల్యాణం వైభవోపేతంగా జరిగింది. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నారు.



మురగళ్లలో అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి కల్యాణం



అల్లూరు: శివపార్వతుల కల్యాణం



చేజర్ల: కోటితీర్థంలో లక్ష బిల్వార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు



మర్రిపాడు: చాబోలులో శివలింగానికి పూజలు చేస్తున్న మహిళలు



జలదంకి: బ్రాహ్మణక్రాక శివాలయంలో..



సంగం: తిరుమనకొండపై కాశీ విశ్వేశ్వరునికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం



ఉదయగిరి: శివాలయంలో అభిషేక పూజలను తిలకిస్తున్న భక్తులు



సీతారామపురం: భైరవకోనలో అష్టదేవాలయాల వద్ద బారులు తీరిన భక్తులు



సోమశిలలో సోమేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



వింజమూరు: నల్లగొండ్లలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కొండాపురం: పూజలు చేస్తున్న భక్తులు



కలిగిరి: సిద్ధేశ్వరాలయంలో భక్తుల పూజలు

ఘనంగా మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం



అల్లూరు: స్థానిక ఆర్‌డీఆర్ కాలనీలో మహాలక్ష్మమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా శనివారం అమ్మవారికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మమ్మ అమ్మవారిని ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. కీలుగుర్రాలు, తప్పెట్ల చప్పుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం



మాట్లాడుతున్న కుదువ వర్తకుల సంఘం నాయకులు

కావలి: కుదువ వర్తకుల ఐక్యత కోసం, సామాజిక సేవా కార్యక్రమాలు కోసం ఏర్పాటు చేసిన కావలి కుదువ వర్తకుల సంఘంలోని నాయకులపై టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కోట రమేష్ అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల ఆ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కావలి పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుదువ వర్తకుల సంఘం అధ్యక్షుడు కనమర్లపూడి వెంకటనారాయణ, కార్యదర్శి మువ్వల మల్లికార్జున, ఉపాధ్యక్షుడు మహంకాళి శివకుమార్ తదితరులు మాట్లాడారు. సంఘం వాట్సాప్ గ్రూప్‌లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలపై జుగుప్సాకరంగా పోస్టులు పెట్టిన కోట రమేష్‌పై చర్యల పట్ల సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు గుర్తుచేశారు. అయినప్పటికీ తాను రాజకీయపరమైన పోస్టులు సంఘం వాట్సాప్ గ్రూప్‌లలో పెడతానని కోటా రమేష్ ఘర్షణపూరితమైన వాతావరణాన్ని సృష్టించడంతో నాయకులు ఆయనను వాట్సాప్ గ్రూప్ నుంచి తొలిగించారని తెలిపారు. అయితే కోట రమేష్ అసలు విషయాన్ని పక్కదారి పట్టించేలా వైఎస్సార్‌సీపీ నాయకుడు కనమర్లపూడి వెంకటనారాయణ అక్రమాలు అంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. సమావేశంలో బంగారు వర్తకుల అసోసియేషన్ అధ్యక్షుడు నల్లూరు రమేష్, గౌరవాధ్యక్షుడు నల్లూరు రాము, కుదువ వర్తకుల సంఘ కార్యదర్శి కనమర్లపూడి ప్రసాద్, కమిటీ సభ్యులు పొన్నూరు మల్లికార్జున, గొల్ల సుధాకర్, అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైవే నిర్వహణపై నిర్లక్ష్యం

- పర్యవేక్షణ లేక సమస్యలు
- వంతెనల మధ్యలో రంధ్రాలు
- ప్రమాదకరంగా మారిన ప్రయాణం



ఆత్మకూరు ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో వంతెనపై ఏర్పడ్డ రంధ్రం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు నియోజకవర్గంలో వైఎస్సార్ జిల్లా సరిహద్దు నుంచి సంగం మండలం చివరి వరకు సుమారు 70 కిలోమీటర్ల మేర 67 నంబరు జాతీయ రహదారి విస్తరించి ఉండగా దాని నిర్వహణపై శాఖా పరమైన పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రోజురోజుకు సమస్యలు అధికమవుతున్నాయి. ప్రధానంగా ఆత్మకూరు మండలంలోని జాలయ్యనగరం నుంచి నెల్లూరు వరకు 67వ నంబరు జాతీయ రహదారి సిమెంటు కాంక్రీట్‌తో నిర్మించగా, అదే జాలయ్యనగరం నుంచి వైఎస్సార్ జిల్లా సరిహద్దు వరకు మూడు వరుసల తారు రోడ్డు నిర్మించారు. నిర్మాణ సమయంలో పాత వంతెనలను తొలగించి కొత్తవి నిర్మించాల్సి ఉండగా చాలా వరకు పాత వాటిని అలాగే ఉంచి జాతీయ రహదారికి అవసరమైన కొలతల మేరకు తూతూమంత్రంగా పనులు చేశారనే విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగా ఆత్మకూరు ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న బ్రిడ్జి, నెల్లూరుపాళెం కూడలికి తూర్పువైపున బ్రిడ్జితోపాటు జిల్లా సరిహద్దుకు సమీపంలో కదిరినాయుడుపల్లి కేతా మన్నేరువాగుపై నిర్మించిన వంతెనల మధ్యలో భారీగా రంధ్రాలు ఏర్పడి వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే గొల్లపల్లి వద్ద బొగ్గేరుపై నూతనంగా నిర్మించిన వంతెన ఇరువైపులా తారురోడ్డుపై ఏర్పడ్డ గుంతలు జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి యమపాశాలుగా ఉన్నాయి. ఆయా వంతెనలకు లోతట్టు ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టి, ఇసుక దిబ్బలు తొలగించకపోవడంతో వాహనాల రాకపోకల సమయంలో రేగుతున్న దుమ్ము కళ్లలో పడుతూ ఆటోలు, ద్విచక్ర వాహనదారులకు రాకపోకలు సమయంలో ప్రాణ సంకట పరిస్థితులు నెలకొన్నాయి. 67వ నంబరు జాతీయ రహదారిపై ఏర్పడ్డ ప్రమాదకర పరిస్థితులను నెలల తరబడి పట్టించుకోని అధికారులు గత మూడు రోజులుగా అక్కడక్కడా రోడ్డుపై వైట్ సిమెంటుతో మార్కింగ్‌లు వేస్తుండడం పట్ల ప్రయాణికులు, ప్రజలు విస్తుపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి 67వ నంబరు జాతీయ రహదారిపై క్షేత్ర పరిశీలన చేసి సత్వరం చేపట్టాల్సిన పనులను సకాలంలో చేపట్టి పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇదే విషయమై జాతీయ రహదారుల విభాగం పీడీ గోవర్ధన్‌ని వివరణ కోరగా తాము నియమించిన కాంట్రాక్టర్ సక్రమంగా పనిచేస్తున్నారని, తమ దృష్టికి తెచ్చిన విషయాలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.



కరటంపాడు సమీపంలో జాతీయ రహదారిపైకి పేరుకుపోయిన మట్టి